అన్ని శాఖల అధికారులు కలిసికట్టుగా పని చేయాలి

సౌత్ వెస్ట్ జోన్ డీసీపీ ఉదయ్‌కుమార్‌రెడ్డి



మాట్లాడుతున్న డీసీపీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

గోల్కొండ: గోల్కొండ కోట బోనాలను విజయవంతం చేయడానికి అన్ని శాఖల అధికారులు కలిసికట్టుగా పని చేయాలని సౌత్ వెస్ట్ జోన్ డీసీపీ ఉదయ్ కుమార్‌రెడ్డి అన్నారు. సోమవారం గోల్కొండ బడా బజార్ మిర్జా గార్డెన్ ఫంక్షన్‌హాల్‌లో బోనాల ఏర్పాట్లపై సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణలోనే గోల్కొండ బోనాలు మొట్టమొదటిసారిగా ప్రారంభమవుతాయన్నారు. కోట బోనాల సందర్భంగా లక్షలాది మంది భక్తులు అమ్మవారి దర్శనానికి తరలివస్తారని ఆయన అన్నారు. భక్తుల రక్షణకు వారి సౌకర్యాల కల్పన కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేయాలన్నారు. బల్దియా డీఎంసీ శశిరేఖ మాట్లాడుతూ.. బల్దియా తరఫున అన్ని రకాల పనులు బోనాల ఉత్సవాల కంటే ముందే పూర్తి చేస్తామన్నారు. అదే విధంగా లంగర్‌హౌస్ చౌరస్తా నుంచి గోల్కొండ కోట చౌరస్తా వరకు రోడ్లకు మరమ్మతులు చేసి అమ్మవారి ఘటాల ఊరేగింపుకు ఎటువంటి అవాంతరం కలగకుండా చేస్తామని ఆమె అన్నారు. గోల్కొండ తహసీల్దార్ అహల్యారెడ్డి మాట్లాడుతూ.. అన్ని శాఖల అధికారుల సమన్వయంతో ప్రభుత్వం ఆధ్వర్యంలో జరిగే గోల్కొండ కోట జగదాంభిక మహంకాళీ అమ్మవార్ల ఆషాఢ మాసం బోనాల ఉత్సవాలను విజయవంతంగా నిర్వహిస్తామన్నారు. ట్రాఫిక్ డీసీపీ రామారావు మాట్లాడుతూ..గతంలో జరిగిన లోటుపాట్లను సవరించుకొని ఎప్పటికప్పుడు అధికారులు, సిబ్బందితో సమన్వయం చేసుకొని ట్రాఫిక్ లేకుండా చూస్తామన్నారు. ఈ కార్యక్రమంలో గోల్కొండ డివిజన్ ఏసీపీ సయ్యద్ ఫయాజ్, దేవాదాయ శాఖ కార్యానిర్వహణ అధికారి ఈ.శ్రీనివాసరాజు, దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ సురేందర్, గోల్కొండ ఇన్‌స్పెక్టర్ సైదులుతో పాటు ఎస్.రాజువస్తాద్, నాయకులు కె.చంటిబాబు, సత్యంరెడ్డి, ఆబిద్, షానవాజ్‌ఖాన్ జలమండలి అధికారులు పాల్గొన్నారు.

'తిరుపతిలో తెలంగాణ ప్రజాప్రతినిధుల లెటర్లు చెల్లడం లేదు'



మంత్రి కొండా సురేఖకు ఫిర్యాదు చేస్తున్న పోల్కం శ్రీనివాస్

అబిడ్స్: తెలంగాణ రాష్ట్ర ప్రజా ప్రతినిధుల సిఫారస్ లెటర్లకు ఆంధ్రప్రదేశ్‌లోని టీటీడీ నిర్వాహకులు ఎలాంటి ప్రాధాన్యత ఇవ్వడం లేదని రాష్ట్ర కాంగ్రెస్ ఓబీసీ సెల్ ప్రధాన కార్యదర్శి పోల్కం శ్రీనివాస్ ఆరోపించారు. సోమవారం రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండ సురేఖకు పోల్కం శ్రీనివాస్ టీటీడీ అధికారులపై ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా పోల్కం శ్రీనివాస్ మాట్లాడుతూ..ఆంధ్రప్రదేశ్‌లో కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాత టీటీడీ అధికారులు తెలంగాణ రాష్ట్రానికి చెందిన ఎంపీలు, ఎమ్మెల్యేలు, మంత్రులు, ఇతర ప్రజా ప్రతినిధుల సిఫారసుల లెటర్లకు ఏ మాత్రం ప్రాధాన్యత ఇవ్వడం లేదన్నారు. ప్రొటోకాల్ ప్రకారం తెలంగాణలోని ప్రజాప్రతినిధుల లెటర్లకు తప్పనిసరిగా ప్రాధాన్యత ఇచ్చే నిబంధన ఉందన్నారు. టీటీడీ అధికారులపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా



ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్‌ను కలిసిన బీఆర్‌ఎస్ నాయకుడు ఆశీష్‌కుమార్ యాదవ్

అఫ్జల్‌గంజ్: గోషామహల్ నియోజకవర్గంలో ప్రజా సమస్యల పరిష్కారానికి బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడుతామని గోషామహల్ నియోజకవర్గం బీఆర్‌ఎస్ నాయకుడు ఆశీష్ కుమార్‌యాదవ్ పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో నియోజకవర్గం నలుమూలలా ప్రజా సమస్యలు పరిష్కరించడంలో ఏ శాఖ అధికారులు కూడా చర్యలు చేపట్టడం లేదన్నారు. సోమవారం హైదరాబాద్ జిల్లా బీఆర్‌ఎస్ అధ్యక్షుడు ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్‌ను కలిసి గోషామహల్ నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ పరిస్థితి, ప్రజా సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా మాగంటి గోపీనాథ్ ఆదేశాల మేరకు నియోజకవర్గంలో జీహెచ్‌ఎంసీ, వాటర్‌బోర్డు, విద్యుత్, ఇతర శాఖల కార్యాలయాల వద్ద ఆందోళనలు చేసి ప్రజా సమస్యలు పరిష్కరిస్తామని ఆశీష్‌కుమార్‌యాదవ్ పేర్కొన్నారు. కార్యకర్తల వల్లనే పార్టీకి కొండంత అండ అని ఆయన అన్నారు. మాగంటి గోపీనాథ్ మాట్లాడుతూ..గోషామహల్ నియోజకవర్గ అభివృద్ధికి బీఆర్‌ఎస్ ముందుంటుందన్నారు.

'ఆధునిక కవులు నవ్యతలోనూ ముందున్నారు'



ముకుంద రామారావును సన్మానిస్తున్న పరిషత్ ప్రతినిధులు

సుల్తాన్‌బజార్: ఆధునిక కవులు అనుకరణలోనే కాదు తమదైన నవ్యతలోనూ ముందంజలోనే ఉన్నారని ప్రముఖ కవి, అనువాదకులు వై.ముకుంద రామారావు అన్నారు. తెలంగాణ సారస్వత పరిషత్‌లోని డాక్టర్ దేవులపల్లి రామానుజరావు కళామందిరంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో ఆయన పరిణితవాణి ప్రసంగం చేస్తూ వలసపోయిన మందహాసం అనే కవితా సంపుటి నుంచి ఎదుర్కొని ఇప్పటి వరకు 8 కవితా సంపుటాలను వెలవరించానని తెలిపారు. ఈ సందర్భంగా వై.ముకుంద రామారావును పరిషత్ అధ్యక్షుడు ఎల్లూరి శివారెడ్డి, ప్రధాన కార్యదర్శి డాక్టర్ జె.చెన్నయ్య ఘనంగా సత్కరించి మెమొంటోను అందజేశారు. ఈ కార్యక్రమంలో సిల్మానాయక్ సమావేశ కర్తగా వ్యవహరించారు.

విజయవాడలో బోనాలకు ఏర్పాట్లు చేయాలి



ఏపీ దేవాదాయ శాఖ మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న గాజుల అంజయ్య బృందం

చార్మినార్: ఆషాఢ మాసం బోనాల జాతర ఉత్సవాలను ఈసారి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఘనంగా నిర్వహించడానికి భాగ్యనగర్ మహంకాళి జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి ఆలయాల ఊరేగింపు కమిటీ తగిన ఏర్పాట్లు చేస్తోంది. ఇందులో భాగంగా వచ్చే నెల 14న విజయవాడ కనక దుర్గమ్మ తల్లికి బంగారు బోనంతో పాటు వడి బియ్యం, పట్టు వస్త్రాలను సమర్పించనున్నారు. విజయవాడ బ్రాహ్మణ వీధిలోని ఈఓ కార్యాలయం నుంచి దుర్గ గుడి పైకి అమ్మవారి భక్తులతో కలిసి సామూహికంగా తెలంగాణ బోనాల జాతర ఉత్సవాలను నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా తెలంగాణ బోనాల ఉత్సవాలను పురస్కరించుకుని విజయవాడలో తగిన ఏర్పాట్లు చేయాలని కోరుతూ ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటీ చైర్మన్ గాజుల అంజయ్య ఆధ్వర్యంలోని ప్రతినిధుల బృందం సోమవారం ఏపీ దేవాదాయ శాఖ మంత్రి ఆనం రాం నారాయణరెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. అంతేకాకుండా ఆరోజు నిర్వహించే బోనాల జాతరకు తప్పనిసరిగా హాజరుకావాలని మంత్రిని కోరారు. మంత్రిని కలిసిన వారిలో భాగ్యనగర్ మహంకాళి జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి ఆలయాల ఊరేగింపు కమిటీ ఉపాధ్యక్షుడు మధుసూదన్ యాదవ్, మాజీ చైర్మన్ జనగామ మధుసూదన్ గౌడ్ తదితరులున్నారు.

చదువుతోనే ఉజ్వల భవిష్యత్తు

గోల్కొండ: చదువుతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని గోల్కొండ సీనియర్ మజ్లిస్ నాయకులు సిరాజ్‌ఖాన్ అన్నారు. రెండున్నర దశాబ్దాలుగా పేదలకు నిస్వార్థంగా సేవలు అందిస్తున్న సందర్భంగా ఆయనను స్థానికులు సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్య అనేది ఒక అమూల్య వస్తువు అని దీన్ని వల్ల ప్రపంచంలో ఏ దేశంలోనైనా ఉపాధి పొందవచ్చునన్నారు.



సిరాజ్‌ఖాన్‌ను సన్మానిస్తున్న దృశ్యం

ఫుట్‌బాల్‌లో సత్తాచాటిన గోల్కొండ విద్యార్థులు



రన్నరప్‌గా నిలిచిన గోల్కొండ విద్యార్థులు

గోల్కొండ: పిల్లలకు సరైన విధంగా శిక్షణ ఇస్తే వారు అద్భుతంగా రాణిస్తారని ప్రముఖ ఫుట్‌బాల్ కోచ్ సయ్యద్ తహసీన్ పాషా అన్నారు. విజయవాడలో ఆచార్య నాగార్జున యూనివర్సిటీ పర్యవేక్షణలో హెచ్‌సీయూ ఫౌండేషన్ స్పోర్ట్స్ ఫర్ చేంజ్ పోటీలు జరిగాయి. ఈ పోటీలకు గోల్కొండ ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల జూనియర్ టీమ్ రన్నరప్‌గా నిలిచింది.

చిన్నపాటి వర్షానికే.. చెరువును తలపించేలా..!

- కులీ కుతుబ్‌షా పాలిటెక్నిక్ కళాశాలలోకి చేరిన మురుగు
- పేరుకుపోయిన చెత్తా చెదారం
- ఇబ్బందులు పడుతున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది
- ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు



కళాశాల ఆవరణలో నిలిచిపోయిన మురుగునీరు



కళాశాల ఆవరణలో పేరుకుపోయిన చెత్తాచెదారం

శాలిబండ: చిన్నపాటి వర్షం వచ్చిందంటే చాలు కులీ కుతుబ్‌షా పాలిటెక్నిక్ కళాశాలలో డ్రైనేజీ మురుగునీరు నిండి చెరువును తలపిస్తుంది. ఈ కాలేజీకు రెండు వైపుల నుంచి నాలాలు ఉండటంతో కొద్దిపాటి వర్షం పడినా నాలాలు పొంగి పార్లి నేరుగా కళాశాల మైదానం, రూమ్‌లోకి వర్షపు, డ్రైనేజీ నీరు చేరుతుంది. కళాశాల చుట్టూ ఉన్న నాలాలపైన అక్రమ కట్టడాలతో అవి పొంగిపార్లి నీటితో పాటు వ్యర్థాలు కాలేజీలోకి చేరుతున్నాయి. ఈ కులీ కుతుబ్‌షా కళాశాలలో 1500 మంది వరకు విద్యార్థులు, 76 మంది ఉపాధ్యాయులు, సిబ్బంది కళాశాలలో ఉంటారు. ఈ నీళ్లతో కళాశాల మొత్తం తీవ్ర దుర్వాసనతో నిండిపోతుందని కళాశాల ప్రిన్సిపాల్ ఎం.సైదులు తెలిపారు. ఈ మురుగునీటితో విద్యార్థులు, సిబ్బంది డెంగీ, మలేరియా లాంటి వ్యాధుల బారిన పడుతామేమోనని భయాందోళనకు గురవుతున్నారు. ఈ సమస్యపై పలుమార్లు జీహెచ్‌ఎంసీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా లాభం లేకుండా పోయిందని ప్రిన్సిపాల్ ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా చుట్టు పక్కల ఉన్న కాలువలకు కొద్ది ఎత్తు గోడలు నిర్మించాలని ప్రిన్సిపాల్ కోరుతున్నారు. కళాశాలలో ప్రస్తుతం పాలిసెట్ కౌన్సెలింగ్ జరుగుతున్న సందర్భంగా విద్యార్థులందరూ తీవ్ర అవస్థలకు గురవుతున్నారని..వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని జీహెచ్‌ఎంసీ అధికారులను కోరుతున్నారు.

అపరిశుభ్రంగా కళాశాల ఆవరణ



ప్రస్తుతం కులీ కుతుబ్‌షా పాలిటెక్నిక్ కళాశాలలో విద్యార్థులకు మూడో రోజు పాలిసెట్ కౌన్సిలింగ్ కొనసాగుతుంది. మురుగు నీరు కళాశాల ఆవరణలోకి రావడంతో అపరిశుభ్రంగా మారింది. దీంతో కళాశాలలో ప్రవేశానికి ఆసక్తి చూపడం లేదు.

– సైదులు, ప్రిన్సిపాల్, కులీ కుతుబ్‌షా పాలిటెక్నిక్ కళాశాల

సాధ్యమైనంత త్వరలోనే పరిష్కరిస్తాం..



కులీ కుతుబ్‌షా పాలిటెక్నిక్ కళాశాలలో వర్షం పడినప్పుడల్లా నీరు చేరడంతో డ్రైనేజీలు పొంగిపొర్లుతున్న విషయం మా దృష్టికి వచ్చింది. సాధ్యమైనంత త్వరలోనే పరిష్కరిస్తాం. ఈ సమస్యను వెంటనే పరిష్కరించాలని డీఈకి ఆదేశాలు జారీ చేశాం.

– శ్రీనివాస్‌రెడ్డి, డిప్యూటీ కమిషనర్, సర్కిల్–10

లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ



గోల్కొండ: కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలు పేదింటి కుటుంబాలకు వరంలాంటివని ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. సోమవారం ఆయన పలువురు కుటుంబాల వారికి మంజూరైన షాదీముబారక్, కల్యాణలక్ష్మి చెక్కులను లబ్ధిదారులకు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ పథకం ద్వారా మంజూరై డబ్బులను కేవలం ఆడపిల్లల పెళ్లి కోసమే వాడాలన్నారు. ప్రభుత్వ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు పేద కుటుంబాలకు ఎంతగానో ఉపయెకరంగా ఉంటున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అధికారులతో పాటు పలువురు మజ్లిస్ నాయకులు ఉన్నారు.

రేపు విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక

చార్మినార్: విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 26న పరిష్కార వేదికను ఏర్పాటు చేస్తున్నామని టీజీఎస్‌పీడీసీఎల్ చార్మినార్ డీఈ లింగయ్య ఓ ప్రకటనలో తెలిపారు. సాలార్‌జంగ్ మ్యూజియం రోడ్డులోని మినార్ గార్డెన్ ఫంక్షన్ హాల్ పక్కన గల డీఈ కార్యాలయంలో బుధవారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు చైర్ పర్సన్, మెంబర్ టెక్నికల్, మెంబర్ ఫైనాన్స్, ఇండిపెండెంట్ మెంబర్ తదితరులు విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. ఎవరికైనా విద్యుత్ సమస్యలతో సతమతమవుతుంటే ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

జీఎస్టీ ప్రాముఖ్యతను అర్థం చేసుకోవాలి

గన్‌ఫౌండ్రీ: విద్యార్థులకు మెరుగైన విద్యను అందించడం ఎంతో అవసరమని ప్రొఫెసర్ ఇంద్ర కాంతి శేఖర్ అన్నారు. సోమవారం కింగ్‌కోఠిలోని సెయింట్ జోసెఫ్ డిగ్రీ, పీజీ కళాశాలల్లో ఇండియన్ అకౌంటింగ్ అసోసియేషన్, కళాశాల వాణిజ్య విభాగం ఆధ్వర్యంలో జీఎస్టీ ఏకీకృత పన్ను–అకౌంటింగ్ ఛాలెంజెస్ అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..నేటి ఆర్థిక పరిస్థితుల్లో జీఎస్టీ ప్రాముఖ్యతను అర్థం చేసుకోవడం ఎంతో అవసరమని సూచించారు. జీఎస్టీ అకౌంటింగ్ సేవలు, ఉత్తమ అభ్యాసాలను మరియు పరిష్కారాలను అందిస్తుందని తెలిపారు. ప్రస్తుత వాణిజ్య విధానాలకు జీఎస్టీ ప్రమాణాలను ఎలా వినియోగించుకోవాలో విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ మారెడ్డి, ప్రిన్సిపాల్ ఆంథోని సగయరాజ, వైస్ ప్రిన్సిపాల్ ప్రణీత్, ఐఏఏ చైర్మన్ డి.ఓబుల్‌రెడ్డి, వైస్ చైర్మన్ వీఎస్ఎన్ మూర్తి, డాక్టర్ రవీంద్రనాథ్, ప్రొఫెసర్ కేవీ ఎస్.లావణ్య పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలి



నాలా పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ, అధికారులు

యాకుత్‌పురా: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు జలమయమైన ప్రాంతాల్లో సోమవారం చార్మినార్, యాకుత్‌పురా ఎమ్మెల్యేలు మీర్ జుల్ఫికర్ అలీ, జాఫర్ హుస్సేన్ మేరాజ్, ఎమ్మెల్సీ మీర్జా రెహ్మత్ బేగ్ అధికారులతో కలిసి పర్యటించారు. బడాబజార్, గంగానగర్ నాలా, మాతాకీ కిడికి, డబీర్‌పురా దర్వాజా, నాగాబౌలీ, పురానీహవేలీ, షేక్ ఫయాజ్ కమాన్ తదితర ప్రాంతాల్లో పర్యటించి అక్కడ కొనసాగుతున్న నాలా మరమ్మతు పనులపై అధికారులతో ఆరా తీశారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రోడ్లపై నిలిచిన వరదా నీటి సమస్యలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. గత కొన్ని రోజులుగా నత్తనడకన కొనసాగుతున్న అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో కార్పొరేటర్ అలాందార్ వాలా జాహి, జీహెచ్‌ఎంసీ, జలమండలి, టీజీ ఎస్‌పీడీసీఎల్ అధికారులు పాల్గొన్నారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్



అబిడ్స్: రౌడీషీటర్లు చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడిగే కఠిన చర్యలు తీసుకుంటామని సౌత్‌వెస్ట్ జోన్ డీసీపీ ఉదయ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం గోషామహల్ డివిజన్ పరిధిలోని రౌడీషీటర్లకు షాహినాయత్‌గంజ్ పోలీస్‌స్టేషన్‌లో కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా డీసీపీ ఉదయ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. రౌడీషీటర్లపై ప్రతి సెక్టార్ ఎస్ఐ ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. ఎవరైనా రౌడీషీటర్ ఏమైన క్రిమినల్ కేసులో భాగస్వాములు అయితే వారిపై కఠిన చర్యలు తప్పవన్నారు. ప్రతిరోజూ తమ పోలీస్ సిబ్బంది వారి పట్ల నిఘా ఉంచి ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడేటట్లు ఉంటే చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో గోషామహల్ ఏసీపీ వెంకట్‌రెడ్డి, షాహినాయత్ గంజ్, మంగళ్‌హాట్ ఇన్‌స్పెక్టర్లు మహేష్ గౌడ్, శోభన్‌బాబు, ఎస్ఐలు లక్ష్మయ్య పాల్గొన్నారు.

ప్రజావాణి దరఖాస్తులు త్వరితగతిన పరిష్కరించాలి

జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



సాక్షి, సిటీబ్యూరో: ప్రజావాణి, ప్రజాదర్బార్ కార్యక్రమంలో వచ్చిన ప్రతి దరఖాస్తును త్వరితగతిన పరిష్కరించాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారి నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ప్రజాప్రతినిధులు సమర్పించిన దరఖాస్తులకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. కలెక్టరేట్‌లో పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమంలో 76 అర్జీలు రాగా గృహ నిర్మాణ శాఖకు 28, హైదరాబాద్ ఆర్‌డీఓ 09, సికింద్రాబాద్ ఆర్‌డీఓకు 06, జిల్లా సంక్షేమ అధికారి 03, డీఈఓ 2, ఇతర శాఖలకు సంబంధించినవి 28 వచ్చాయని కలెక్టర్ తెలిపారు.

ఉస్మానియాలో రోగులకు ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు



వైద్యులకు సూచనలు ఇస్తున్న సూపరింటెండెంట్ డాక్టర్ నాగేందర్

అఫ్జల్‌గంజ్: తెలంగాణ జూనియర్ వైద్యుల సంఘం ధర్నాకు దిగిన నేపథ్యంలో ఉస్మానియా ఆసుపత్రి రోగులకు ఇబ్బందులు కలుగకుండా తగిన ఏర్పాట్లు చేసినట్లు డాక్టర్ బి.నాగేందర్ తెలిపారు. సోమవారం ఆసుపత్రి వార్డులు, ఓపీ తదితర ప్రాంతాలను అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..ఉస్మానియాలోని సీనియర్ వైద్యులతో రోగులకు వైద్య సేవలందిస్తున్నామన్నారు. సోమవారం 3392 మంది ఓపీ, 122 ఇన్‌పేషంట్లుగా చేరారన్నారు. ఎంపిక చేసిన 145 ఆపరేషన్లు నిర్వహించినట్లు ఆయన తెలిపారు.

బోనాలకు భారీ ఏర్పాట్లు చేయాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజాసింగ్

అబిడ్స్: బోనాల ఉత్సవాలకు అన్నిశాఖల అధికారులు భారీ ఏర్పాట్లు చేయాలని గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ పేర్కొన్నారు. సోమవారం హిందీనగర్‌లో పలు శాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన ప్రసంగించారు. అన్ని శాఖల అధికారులు సంయుక్తంగా ఉండి ఆలయాల పరిసరాలు, ఆలయాల వద్ద సకల ఏర్పాట్లు చేయాలన్నారు. జీహెచ్‌ఎంసీ, విద్యుత్, ఇంజినీరింగ్, సివరేజ్, శానిటేషన్, ట్రీ కటింగ్, ట్రాఫిక్ మేనేజ్‌మెంట్, ఇతర శాఖల అధికారులు వేగంగా పనులు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ విద్యాధర్, తహసీల్దార్, మన్నె ప్రేమ్‌కుమార్, ఏసీపీలు వెంకట్‌రెడ్డి, చంద్రశేఖర్, కార్పొరేటర్లు భీశ్వ సురేఖ, లాల్‌సింగ్, రాకేష్ జైస్వాల్, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆరెకటిక బోనాల ఉత్సవ సమితి అధ్యక్షుడిగా దిలీప్‌కుమార్



జియాగూడ: జియాగూడ ఆరెకటిక బోనాల ఉత్సవ సమితి అధ్యక్షుడిగా ఉల్కుందకర్ దిలీప్‌కుమార్ ఎంపికయ్యారు. ఆదివారం రాత్రి జియాగూడ ఆరెకటిక ట్రస్ట్, ఆరెకటిక సంఘం ఆధ్వర్యంలో జరగబోయే బోనాలు, గణేష్, దేవీ నవరాత్రి ఉత్సవాలకు నూతన కమిటీ ఏర్పాటైంది. చైర్మన్‌గా వి.శశికాంత్ రావు, అధ్యక్షుడిగా వి.దిలీప్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా కోయల్‌కార్ గడ్డం రాజ్‌కుమార్, కోశాధికారిగా వి.సత్యనారాయణ ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో ఆరెకటిక ట్రస్ట్ చైర్మన్ కె.దివాకర్ లాల్, సంఘం అధ్యక్షుడు టి.నర్సింగ్‌రావు, ప్రధాన కార్యదర్శి వి.నాగేష్ కటిక్, కోశాధికారి ఎం.రూపేష్‌లాల్, ఉపాధ్యక్షుడు వి.హరిలాల్, పి.దర్శన్, కార్యదర్శులు జి.శ్రీకాంత్, ఎం.రాకేష్, కెఎన్.ప్రేమ్ కిశోర్, ఎం.రాఘవేందర్, ఎం.మహేష్, గాండ్ల శ్రీనివాస్ తదితరులు ఆయనను సన్మానించారు.

జూనియర్ అసిస్టెంట్ వేణుగోపాల్‌కు పదోన్నతి



ఎస్.ఎం.హుస్సేన్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్న వేణుగోపాల్

నాంపల్లి: జీపీఎస్ హైదర్‌బస్తీ సికింద్రాబాద్ పాఠశాలలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేసే వేణుగోపాల్‌కు పదోన్నతి లభించింది. ఈ మేరకు హైదరాబాద్ జిల్లా విద్యాశాఖ అధికారిణి రోహిణి పదోన్నతి ఉత్తర్వులు జారీ చేశారు. జూనియర్ అసిస్టెంట్ నుంచి స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ డైరెక్టర్‌గా పదోన్నతి పొందిన వేణుగోపాల్ తన ఉన్నతికి సహకరించిన డీఈఓ రోహిణి, జేఆర్. వేణుగోపాల్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. ఇందులో భాగంగా టీఎన్జీఓ హైదరాబాదు జిల్లా సహాధ్యక్షులు కె.ఆర్.రాజ్‌కుమార్ నేతృత్వంలో సోమవారం టీఎన్జీఓ కేంద్ర సంఘం ప్రధాన కార్యదర్శి ఎస్.ఎం.హుస్సేన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. టీఎన్జీఓ డీఈఓ యూనిట్ కార్యదర్శి భాస్కర్, కోశాధికారి ఎస్.డి.ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా అవగాహన ర్యాలీ



అబిడ్స్: మాదకద్రవ్యాల వినియోగం ఎంతో ప్రమాదకమని పెద్ద ఎత్తున అవగాహన నిర్వహించారు. ఫ్రీమేసన్స్ సంస్థ ఆధ్వర్యంలో అబిడ్స్ నుంచి ఎంజే మార్కెట వరకు అవగాహన ర్యాలీ చేపట్టారు. మాదక ద్రవ్యాలతో జీవితాలు ప్రమాదకరమని మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా వాకథాన్ ర్యాలీని చేపట్టారు. సోలస్ మీడియా వ్యవస్థాపకుడు డి.రామచంద్రన్, అనిల్ దేశాయ్, వీరభద్రుడు, మంచాల రమేష్, డాక్టర్ శ్రీరంగ్ అప్కారి, రాజ్ నర్సింగ్ ఈ అవగాహన ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా డ్రగ్స్ వద్దంటూ ప్లకార్డులు ప్రదర్శించారు. చిన్నప్పటి నుంచే డ్రగ్స్‌తో కలిగే ప్రమాదాలపై అందరికీ అవగాహన కల్పించాలని వారు నినాదాలు చేశారు. రామచంద్రన్ మాట్లాడుతూ..ఫ్రీమేషన్స్ సంస్థ ఆధ్వర్యంలో తరచూ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు.

అనీస్-ఉల్-గుర్బాకు విద్యార్థుల తరలింపు



సాక్షి, సిటీబ్యూరో: టిమ్రీస్ ముషీరాబాద్ బాలికల–1లో ఉంటున్న అనాథ విద్యార్థులను నాంపల్లిలోని అనీస్–ఉల్–గుర్బా భవన సముదాయానికి సోమవారం తరలించారు. ఇందులో 19 మంది విద్యార్థుల్లో ఇద్దరు బాలురు, 17 మంది బాలికలు ఉన్నారు. వీరి కోసం మాంటిస్సోరి శిక్షణ పొందిన ఒక ఉపాధ్యాయుడు, ఇద్దరు ఆయాలు, ముగ్గురు హౌస్ కీపింగ్, ఇద్దరు వంట సిబ్బందిని ప్రత్యేకంగా కేటాయించారు. నాంపల్లిలోని అనీస్–ఉల్–గుర్బా భవనంలో అనాథల కోసం 4వ తరగతి వరకు మాంటిస్సోరి, ప్రాథమిక పాఠశాలను ప్రారంభించాలని ట్రిమిస్ ప్రతిపాదించినట్లు తెలంగాణ మైనారిటీస్ రెసిడెన్షియల్ విద్యాసంస్థల సొసైటీ కార్యదర్శి అయేషా మసరత్ ఖానం తెలిపారు.

ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



మాట్లాడుతున్న ట్రాఫిక్ ఏసీపీ శంకర్ రాజు

చార్మినార్: ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ట్రాఫిక్ ట్రెనింగ్ ఇన్‌స్టిట్యూట్ ఏసీపీ జి.శంకర్‌రాజు అన్నారు. పాతబస్తీ శాలిబండలోని తపస్య జూనియర్ కాలేజీ విద్యార్థులకు ఆయన సోమవారం ట్రాఫిక్ నిబంధనలు–రోడ్డు సేఫ్టీపై అవగాహన కలిగించారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పలు అంశాలను విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లైసెన్స్ లేకుండా వాహనాలను నడిపితే రూ.5 వేల జరిమానాతో పాటు 3 నెలల పాటు జైలు శిక్ష కూడా విధించవచ్చునన్నారు. మైనర్లు ఎట్టిపరిస్థితుల్లో వాహనాలను నడుపరాదని.. వారు పట్టుపబడితే వాహనాల యజమానులకు సైతం జైలు శిక్షలు పడతాయన్నారు. ఈ కార్యక్రమంలో తపస్య కాలేజీ ప్రిన్సిపాల్ తబస్సుం ఫాతిమా, వైస్ ప్రిన్సిపాల్ సిద్ధు, ఫలక్‌నుమా ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రఘునాథ్ పాల్గొన్నారు.

పోలీసులపై హెచ్చార్సీలో బీజేవైఎం ఫిర్యాదు

నాంపల్లి: దాడి చేసిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు సెవెళ్ల మహేందర్ సోమవారం రాష్ట్ర మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఉద్యోగాలు భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ టీజీఎస్‌పీఎస్సీ కార్యాలయాన్ని ముట్టడించడానికి వెళ్లిన బీజేవైఎం కార్యకర్తలు, నేతలపై పోలీసులు దాడులకు పాల్పడ్డారని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం పోలీసులతో నిరుద్యోగుల గొంతు నొక్కేందుకు ప్రయత్నిస్తోందన్నారు. కాంగ్రెస్ పార్టీ నిరుద్యోగులను జాబ్ కేలండర్ పేరిట మోసగిస్తే, తాము ఉద్యమ కేలండర్ రూపొందించి నిరుద్యోగులను సంఘటితపర్చి పోరాటం చేస్తామని హెచ్చరించారు. పోలీసుల చేతుల్లో గాయపడిన వారు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని చెప్పారు.